సాక్షి
ప్రకాశం
సోమవారం । 25 । నవంబర్ । 2024



పచ్చని కొండలను పిండేస్తున్నారు

పెద్దారవీడు మండలంలో తెలుగు తమ్ముళ్లు ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. - 8లో..



ప్రజలను కలిపి ఉంచేదే కవిత్వం

ప్రజలను కలిపి ఉంచేదే కవిత్వమని, కవి సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ప్రముఖ కవి కే శివారెడ్డి అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చిరుగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

నేటి నుంచి రెసిడెన్షియల్ శిక్షణ

ఒంగోలు సిటీ: జిల్లాలోని స్కూల్ లీడర్షిప్ ట్రెనింగ్ ప్రోగ్రాంనకు కేటాయించిన ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ఈ నెల 25 నుంచి 6 రోజుల పాటు ఒంగోలులోని శ్రీరామచంద్రమిషన్ లో జరిగే రెసిడెన్షియల్ శిక్షణకు హాజరు కావాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు 25వ తేదీ సోమవారం నుంచి చీరాలలో జరిగే ఎఫ్.ఎల్.ఎన్ ట్రెనింగ్ కు విధులు కేటాయించిన ఉపాధ్యాయులు కూడా హాజరు కావాలన్నారు. విధులు కేటాయించిన వారి వివరాలు ఇప్పటికే మెయిల్, వాట్సప్ ద్వారా పంపించినట్లు తెలిపారు. ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు విధులు కేటాయించిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నెపంతో వేధిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా విద్యార్థులకు హాల్‌టికెట్‌లు ఇవ్వకుండా, ప్రాక్టికల్ పరీక్షలను నిరోధించడం వంటి ఇబ్బందులు, వేధింపులు చేస్తే ఆయా కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు వస్తున్నాయని కాలేజీలకు ప్రభుత్వం చెల్లించేలా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, ఆ ఉత్తర్వులు మీరి విద్యార్థుల సర్టిఫికెట్‌లు నిలుపుదల చేయడం వంటి చర్యలు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా జిల్లా యూటీఎఫ్ మహాసభలు ఒంగోలు టీటీడీ కళ్యాణమండపంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఒంగోలు నగర వీధుల్లో ఉపాధ్యాయులు నినాదాలు చేసుకుంటూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండా, ఉపాధ్యాయ జెండాలను ఎం.వెంకటేశ్వరరెడ్డి, కె.శ్రీనివాసరావు, ఓ.వి.వారారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు హాజరై ఉపాధ్యాయుల సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతలతో విద్యా బోధన చేయాలని, సమాజం పట్ల బాధ్యతతో ఉండాలన్నారు. స్వర్ణోత్సవాలు సందర్భంగా జిల్లా స్థాయిలో ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొని విజేతలైన ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి రోజు స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేసిన కార్యకర్తలందరికీ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఓ.వి.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

మార్కాపురం టౌన్: కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక, సర్వ సభ్య సమావేశం ఆదివారం స్థానిక డ్వాక్రా బజార్‌లో స్టేట్ సెక్రటరీ పి.పద్మ జబాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా డి.దుర్గేష్ రెడ్డి, చైర్మన్‌గా ఎం.శ్రీకాంత్, సెక్రటరీగా సీహెచ్ పుల్లయ్య, ఉపాధ్యక్షునిగా సిద్ధం శివరాంప్రసాద్, జాయింట్ సెక్రటరీగా జీ.సతీష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా యం.కోటేశ్వరరావు, వెంకయ్యనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కె.రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ నూతన కార్యవర్గం

అందని భరోసా

నిత్యం కడలితో సహవాసం చేస్తూ.. నడి సంద్రాన ఆశల వల విసురుతూ బతుకు పోరు సాగించే మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇచ్చే మత్స్యకార భరోసా నగదు ఈ ఏడాది ఇంత వరకు వారికి అందలేదు. గత ప్రభుత్వానికన్నా రెట్టింపు నగదు ఇస్తామని హామీలు గుప్పించి గద్దెనెక్కిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా దానిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. దీంతో వేలాది మంది మత్స్యకారులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

- మత్స్యకార భరోసాపై నీలి నీడలు
- జిల్లాలో 5,459 మంది ఎదురుచూపులు
- గత ఐదేళ్లు సమయానికి అందుతున్న భరోసా
- ఈసారి అనుమానమే అంటున్న మత్స్యకారులు
- భరోసా రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- చేపల వేట సరిగా లేక ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు



పాకల సముద్ర తీరంలో నిలిపి ఉంచిన బోట్లు

సింగరాయకొండ: సముద్రంలో వేటే జీవనాధారంగా బతికే మత్స్యకారులు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, సముద్రంలో కలుస్తున్న రొయ్యల చెరువుల రసాయనిక వ్యర్థాలు, తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన సోనాబోట్లు తీరంలో వేటాడటం తదితర కారణాలతో చేపల వేట నిరాశాజనకంగా ఉంది. ఏటా ప్రభుత్వం చేపల ఉత్పత్తి కోసం గుడ్లు పెట్టే సీజన్ అయిన ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేట నిషేధం అని ప్రకటించింది. వేట నిషేధ కాలానికి ఆర్థిక భరోసాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వగా, ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసింది. దీంతో మత్స్యకార భరోసా ఎప్పుడు ఇస్తారోనని 5 నెలలుగా మత్స్యకారులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.

అర్హుల జాబితా సిద్ధంగా ఉన్నా..

జిల్లాలో 5 మండలాల పరిధిలో మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. మత్స్యకారుల్లో 50 ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వం పింఛన్ పథకం కింద ప్రతినెలా ఆర్థిక సహాయం అందజేస్తుండగా.. మిగిలిన 50 ఏళ్లలోపు మత్స్యకారులకు ప్రభుత్వం మత్స్యకార భరోసా ఇస్తోంది. జిల్లాలో 5,459 మంది మత్స్యకార భరోసా కింద అర్హులుగా ఆయా మండలాల మత్స్యశాఖాధికారులు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జాబితా సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. ఆ ప్రకారం కొత్తపట్నం మండలంలో 3,113 మంది, నాగులుప్పలపాడు మండలంలో 307 మంది, ఒంగోలు మండలంలో 502 మంది, సింగరాయకొండ మండలంలో 1,440 మంది, టంగుటూరు మండలంలో 97 మంది భరోసాకు అర్హులని జాబితా సిద్ధం చేశారు.

వేట నిషేధ భత్యం కోసం ఎదురుచూపులు:

వేట నిషేధకాలం పూర్తయి నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మత్స్యశాఖా మంత్రి ఏ ఒక్కరూ వేట నిషేధ భత్యం ఎప్పుడు ఇస్తామో ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. క్యాబినెట్ సమావేశంలో అయినా వేట నిషేధ భత్యంపై చర్చిస్తారని ఆశించిన మత్స్యకారులకు నిరాశే మిగిలింది. చివరికి ఇటీవల ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కూడా అరకొర నిధులే కేటాయించారు. దీంతో అసలు వేట నిషేధ భత్యం ఇస్తారా? ఒకవేళ ఇస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చినట్లు రూ.10 వేలు ఇస్తారా, లేక టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు రూ.20 వేలు ఇస్తారా అన్న దానిపై స్పష్టత రావటం లేదు. ప్రభుత్వ పనితీరు చూస్తుంటే ఈ ఆర్థిక సంవత్సరానికి భరోసా పథకానికి మంగళం పాడేటట్లు ఉందని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరికి ఈనెల 21వ తేదీ ప్రపంచ మత్స్యకార దినోత్సవం రోజైనా ఇస్తారని ఆశించామని అది కూడా నిరాశే మిగిలిందని ఆవేదన చెందుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మత్స్యశాఖ అధికారులు సిద్ధం చేసిన జాబితా ప్రకారం మత్స్యకార భరోసా రూ.10 వేలు ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం అర్హులందరికీ భరోసా ఇస్తామని, లబ్ధిదారుల జాబితాను మళ్లీ సిద్ధం చేయాలని సుమారు ఐదు నెలల క్రితం మత్స్యశాఖా మంత్రి అచ్చెంనాయుడు టెలికాన్ఫరెన్స్‌లో ఆ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు తప్ప ఇంత వరకు జాబితా తయారీకి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వలేదు. దీనిని బట్టి ఈ సంవత్సరం భరోసా అటకెక్కినట్లేనని అధికారులు అంటున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. వేట నిషేధ భత్యం రాక, చేపల వేట సక్రమంగా సాగక, సోనాబోట్ల కారణంగా వలలు తెగిపోయి లక్షలాది రూపాయలు నష్టపోతున్నామని, మరో పక్క ఉపాధి పనులు కూడా లేవని.. పెరిగిన నిత్యావసర ధరలు, కూరగాయల ధరలతో బతుకు భారమైందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సక్రమంగా సాగని చేపల వేట

ప్రకృతి వైపరీత్యాలు, సోనాబోట్ల తాకిడితో కొద్ది నెలలుగా చేపల వేట ఆశాజనకంగా లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదున్నర నెలల కాలంలో కేవలం నెలరోజులు మాత్రమే చేపల వేట సక్రమంగా సాగిందని మత్స్యకారులు చెబుతున్నారు. సుమారు 2 నెలల పాటు ప్రకృతి వైపరీత్యాలతో చేపల వేటకు వెళ్లొద్దని ఆంక్షలు విధించగా, మిగిలిన రోజులు వేటకు వెళితే డీజిల్ ఖర్చులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సముద్ర తీరానికి దగ్గరగా వచ్చిన సోనాబోట్లు

నెలలు గడుస్తున్నా భరోసా ఏదీ..



గత ఐదు సంవత్సరాలుగా మత్స్యకార భరోసా రూ.10 వేలు మత్స్యకారులకు సకాలంలో అందింది. ఈ ఎన్నికల్లో చంద్రబాబు వేట నిషేధ భత్యం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. కానీ వేట నిషేధకాలం ముగిసి నెలలు గడుస్తున్నా మత్స్యకార భరోసాకు సంబంధించి ఒక్క ప్రకటన రాలేదు. ఇస్తారో లేదో తెలియదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మత్స్యకారులకు భరోసా నగదు త్వరగా ఇవ్వాలని కోరుకుంటున్నా.

– తంబు ఆదినారాయణ, బేసిన్‌పల్లెపాలెం, ఊళ్లపాలెం

మత్స్యకారులను ఆదుకోండి



ప్రతి సంవత్సరం వేట నిషేధ కాలం పూర్తి కాగానే మత్స్యకార భరోసా ప్రభుత్వం ఇచ్చేది. కానీ ఈసారి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెలలు గడుస్తున్నా మత్స్యకార భరోసా ఇవ్వలేదు. చేపల వేట కూడా ఆశాజనకంగా లేదు. భరోసా మొత్తం ఇచ్చి మత్స్యకారులను ఆదుకోవాలి.

– తంబు రఘురామయ్య, బేసిన్ పల్లెపాలెం, ఊళ్లపాలెం

కొత్త ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు



ప్రతి సంవత్సరం వేట నిషేధ కాలం పూర్తి కాగానే మత్స్యకార భరోసా ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఈసారి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకార భరోసా పై ఎటువంటి ప్రకటన చేయలేదు.

– కొండూరి పాల్, క్రాంతినగర్, పాకల

ఆపదలో ఆదుకోవడమే మన నైజం



రెడ్డి కార్తీక వనభోజనాల కార్యక్రమంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

- అందరి హితం కోరేదే రెడ్డి సామాజికవర్గం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

మద్దిపాడు: తోటి వారు ఆపదలో ఉంటే ఆదుకోవడమే మన నైజమని, మన పక్కన ఉండే వారి హితం కోరేవాడు రెడ్డి అవుతారని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. మల్లవరం రిజర్వాయర్ దగ్గర రెడ్డి జనాభ్యుదయ సంఘం ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ తాను ఐఏఎస్ అధికారి అవ్వాలని డిగ్రీ అయిపోయిన తర్వాత వెంటనే గ్రూప్ వన్ కోచింగ్ కి వెళ్లానని, రెడ్డి జన అభ్యుదయ సంఘం పేద విద్యార్థులకు ఏర్పాటు చేసిన హాస్టల్లోనే తాను ఉంటూ చదువుకుంటానని తన తండ్రికి చెప్పానని తెలిపారు. రెడ్డి సామాజికవర్గంలో పలువురు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, వారందరికీ సహాయపడతానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రెడ్డి అంటే రక్షించేవాడని, తన వెంట ఉన్న ప్రజలను రక్షిస్తూ సమాజానికి సేవ చేసేవాడని అన్నారు. సామాజికవర్గ సంక్షేమానికి రెడ్డి జనాభ్యుదయ సంఘం విశేషమైన కృషి చేస్తుందని అభినందనలు తెలిపారు. అదే క్రమంలో పేద విద్యార్థులకు ఒంగోలులో హాస్టల్ వసతి ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. అందరినీ అభివృద్ధి పథంలో నడిపిస్తూ అందరి బాగోగులు గమనించడమే రెడ్డి లక్షణంగా ఉంటుందని, రెడ్డి కులం ఇతరులకు సహాయపడే నైజాన్ని కలిగి ఉంటుందని అన్నారు. ముందుగా సంఘం ఆధ్వర్యంలో చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. అందరికీ కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను రెడ్డి జనాభ్యుదయ సంఘం అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, కార్యదర్శి లింగారాం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో బన్నీ, వెంకటేశ్వర్ రెడ్డి, జనాభ్యుదయ సంఘం ట్రెజరర్ కొత్త సీనా రెడ్డి వెంకటరెడ్డి, గౌరవ సలహాదారులు రామసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, కార్యనిర్వాహక సభ్యుడు జి చంద్రారెడ్డి, ఆర్ సుధాకర్ రెడ్డి, వనమా సుబ్బారెడ్డి, నార్నే వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాకీల పచ్చపాతం

- కానిస్టేబుల్‌పై టీడీపీ నేత దాడి చేస్తే నోటీసులిచ్చి పంపేశారు
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసు స్టేషన్ల వెంట తిప్పుతూ వేధిస్తున్నారు
- ఖాకీల మీద దాడి చేస్తే లెక్కలేనట్లు వ్యవహరిస్తున్న పోలీసు అధికారుల తీరుపై విమర్శలు
- రేపు మా మీద దాడులు జరగవని గ్యారంటీ లేదంటున్న పోలీసు కానిస్టేబుళ్లు
- అభద్రత మధ్య విధులు నిర్వహించడం ఎలా అని అంతర్మథనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అంతా అనుకున్నట్లే అయింది. పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాసరావుపై దాడి కేసులో నిందితుడు, టీడీపీ నాయకుడు బోడపాటి రాంబాబును ఎట్టకేలకు పట్టుకొచ్చిన పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పోలీసు కానిస్టేబుల్ అని కూడా చూడకుండా అకారణంగా దాడి చేసి కొట్టడం, చేయి కొరకడం, ఆయన మీద నుంచి కారును దూకించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. నిందితుడు అధికార తెలుగుదేశం పార్టీ నాయకుడు కావడం, పైగా టీడీపీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతోపాటు జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధుల తీవ్ర ఒత్తిడి వల్లనే ఎలాంటి చర్యలు తీసుకోలేదని కానిస్టేబుళ్లు రుసరుసలాడుతున్నారు. కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని కొందరు కానిస్టేబుళ్లు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను మాత్రం ఎక్కడెక్కడ నుంచో తీసుకొచ్చి వేధింపులకు పాల్పడుతున్న వైనాన్ని వారు గుర్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఆపరేషన్ కోసం సిద్ధంగా ఉన్న ప్రవీణ్ రెడ్డిని ఆస్పత్రిలోనే అరెస్టు చేసిన పోలీసులు ఆయనపై సంతనూతలపాడులో కేసు పెట్టించి వేధింపులకు పాల్పడ్డారని, అయ్యప్పమాలలో ఉన్న సత్తెనపల్లికి చెందిన కల్లా నాగిరెడ్డిని దేవాలయానికి వెళుతుండగా అరెస్టు చేసి మార్కాపురం తరలించారని గుర్తు చేస్తున్నారు. అలాగే వైజాగ్‌కు చెందిన రమణారెడ్డిని అరెస్టు చేసి పొదిలి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారని, దర్శిలో కూడా కేసు పెట్టి పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పారని చెబుతున్నారు. ఒక మహిళ అని కూడా చూడకుండా పెద్దిరెడ్డి సుధారాణిపై కేసులు పెట్టి తెలంగాణ నుంచి చిలకలూరి పేట, అక్కడ నుంచి ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లు తిప్పారని, అర్ధరాత్రి కూడా పోలీసు స్టేషన్లో పడిగాపులు కాసేలా చేసిన పోలీసు అధికారులకు.. సొంత శాఖకు చెందిన కానిస్టేబుల్ ను కొడితే మాత్రం చీమకుట్టినట్టయినా లేకపోవడం దారుణమని చెబుతున్నారు. ఇదే తరహా దాడి ఒక కానిస్టేబుల్‌పై కాకుండా ఒక అధికారి మీద జరిగి ఉంటే పోలీసు అధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా ప్రవర్తించేవారా అని ప్రశ్నిస్తున్నారు. కానిస్టేబుల్‌కు ఒక న్యాయం, అధికారులకు ఒక న్యాయమా అని వాపోతున్నారు. కానిస్టేబుల్ శ్రీనివాసరావు మీద దాడి చేశాడని, ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలి పెడితే రేపు ఇంకొక కానిస్టేబుల్ మీదనో, ఏఎస్‌ఐ మీదనో దాడి చేయడనే గ్యారంటీ లేదని చెబుతున్నారు. భద్రత లేని వాతావరణంలో స్వేచ్ఛగా విధులు నిర్వహించడం ఎలాగో అధికారులు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కానిస్టేబుల్ శ్రీనివాసరావుపై దాడి చేసిన రాంబాబును కఠినంగా శిక్షించి పోలీసు సత్తా చూపాలని పేరు చెప్పడానికి ఇష్టపడని కానిస్టేబుల్ ఒకరు డిమాండ్ చేశారు.



ఆ రోజు ఏం జరిగిందంటే...

ఈ నెల 20వ తేదీ రాత్రి ముంగమూరు రోడ్డులో ఇండియన్ గ్యాస్ ఆఫీస్ మూలమీద ఉన్న ఒక కాకా హోటల్‌లో కానిస్టేబుల్ శ్రీనివాసరావు టిఫిన్ చేస్తున్నారు. ఆయన మోటారు బైకును హోటల్ ఎదురుగా ఆపారు. ఆ సమయంలో శివప్రసాద్ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు బోడపాటి రాంబాబు కారులో అటుగా వచ్చాడు. హోటల్ ముందు కారు ఆపి మోటారు బైకు తీయమని చెప్పాడు. టిఫిన్ చేస్తున్న కానిస్టేబుల్ వెంటనే వెళ్లి బైకు అడ్డం తీశారు. అయినా ఈ రోడ్డు నీ అబ్బ సొత్తనుకుంటున్నావా నా కొ...అంటూ అసభ్యంగా తిడుతూ రాంబాబు కారు దిగివచ్చి కానిస్టేబుల్‌పై అకారణంగా దాడికి దిగాడు. అడ్డుకున్న ఆయన చేతిని కొరికాడు. పోతూ పోతూ కానిస్టేబుల్ మీద నుంచి కారును దూకించాడు. ఈ ఘటన మీద తాలూకా పోలీసులు హత్యాయత్నం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇది జరిగిన కొద్దిసేపటికే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ నుంచి తాలూకా పోలీసు స్టేషన్‌కు ఫోన్ వచ్చినట్లు ప్రచారం జరిగింది. అది ఒట్టి ప్రచారం మాత్రమేనని టీడీపీ నాయకులు ఖండించారు. ఆ తరువాత 5 రోజులుగా నిందితుడు రాంబాబు అజ్ఞాతంలోకి వెళ్లి పోయాడు. తీరా అన్నీ సర్దుబాటు చేసుకున్న తరువాత తీరిగ్గా ఆదివారం తాలూకా పోలీసులు రాంబాబును అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇంటల్లుడికి మర్యాద చేసినట్లు కూర్చోబెట్టి నోటీసు ఇచ్చి పంపించారు. కేసు విచారణలో ఉందని తాలూకా సీఐ చెబుతున్నారు. అరెస్టు గురించి అడిగితే జవాబు దాటవేశారు. ఇదిప్పుడు పోలీసు శాఖలో పెద్ద దుమారం రేపుతోంది.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ పోటీలు



వీడియో ద్వారా ఇంగ్లిష్ పాఠాలు వింటున్న విద్యార్థులు



అపెక్స్ స్కూల్‌లో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

SAKSHI MATH BEE 2024-25 · SAKSHI SPELL Bee 2024-25

ఒంగోలు సిటీ: సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్‌బీ రెండో లెవల్ పోటీలు ఆదివారం స్థానిక అపెక్స్ హైస్కూల్, ఆంధ్ర హైస్కూల్‌లలో ఉత్సాహంగా జరిగాయి. ప్రెజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వాఫీ, అసోసియేట్ స్పాన్సర్‌గా రాజమండ్రి ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వారు వ్యవహరించారు. రెండో లెవల్ లో నాలుగు కేటగిరీల కింద పోటీలు నిర్వహించారు. పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ పోటీలను అపెక్స్ హైస్కూల్ కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి, టీచర్లు అనురాధ, వనజ, శ్రీలక్ష్మీ, ఆంధ్ర హైస్కూల్ కరస్పాండెంట్ బొమ్మల శ్రీనివాసరావు, టీచర్లు కోటేశ్వరరావు, కంప్యూటర్ టీచర్ రేష్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. 'సాక్షి' యాడ్స్ విభాగం మేనేజరు శర్మ, ప్రతినిధి హనుమంతరావు పర్యవేక్షించారు.

ఇంగ్లిష్ పదాల్లో లోతైన అర్థం తెలుస్తుంది



'సాక్షి' స్పెల్‌బీ మాకు ఎంతో ఉపయోగపడింది. ఇంగ్లిష్‌లో ఉన్న లోతైన అర్థాలు తెలుస్తాయి. అలాగే స్టేజీపై మాట్లాడేందుకు మా భాషను మెరుగుపరుచుకోవచ్చు. 'సాక్షి'కి ధన్యవాదాలు.

– ఎం.విజిత, 9వ తరగతి

స్పెల్‌బీ తో మెరుగైన భాష



స్పెల్‌బీ ప్రోగ్రాం వల్ల ఇంగ్లిష్‌లో మరింత నైపుణ్యం సాధించవచ్చు. భాషలో ఉన్న పదాల అర్థం తెలుస్తుంది. మా ఉపాధ్యాయులు మమ్మల్ని ప్రోత్సహించారు.

– కె.శ్రీరంగ, 4వ తరగతి

'సాక్షి' స్పెల్‌బీ వల్ల ఇంగ్లిష్ పట్టు దొరుకుతుంది



నేను 'సాక్షి' స్పెల్‌బీలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది. స్పెల్ బీ వల్ల ఆంగ్ల భాషపై పట్టు, నైపుణ్యం సాధించడానికి వీలుంటుంది.

– సమీరాభావజ్ఞ, 7వ తరగతి

సరైన ఉచ్చారణ అలవడుతుంది



ఇప్పుడున్న సాంకేతిక ప్రపంచంలో ఇంగ్లిష్ అనేది తప్పక అవసరం. అందుకు అనుగుణంగా స్పెల్‌బీ వల్ల అమెరికా, ఇంగ్లాండ్‌లోని మాండలిక భాష మాట్లాడడానికి ఎంతో ఉపయోగపడుతోంది.

– బి.వి.వర్షిణి, 8వ తరగతి

26న మహాధర్నాను జయప్రదం చేయాలి

ఒంగోలు టౌన్: ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ఈ నెల 26వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు తంబి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని మస్తాన్ దర్గా వద్ద భవన నిర్మాణ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలు, కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు, రైతు చట్టాల రద్దును వ్యతిరేకించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని నగర కార్యదర్శి సయ్యద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయాలని, బిల్డింగ్ వర్కర్లకు సంబంధించిన క్లయిమ్‌లు చెల్లించాలని కోరారు.

క్లుప్తంగా

చోరీ సొత్తు రికవరీ!

సింగరాయకొండ: ఓ దొంగ చోరీ చేసి గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టుపెట్టిన చోరీ చేసిన బంగారాన్ని ఏలూరు జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఈ సంఘటన శనివారం సింగరాయకొండలో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన రంగనాథన్ కిరణ్ చోరీలు చేసిన సొత్తును గోల్డ్‌లోన్ కంపెనీలో తాకట్టుపెట్టి సొమ్ము చేసుకుంటూ జీవిస్తుంటాడు. ఇతనిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలోనే సింగరాయకొండలోని కీర్తన గోల్డ్ లోన్ కంపెనీలో 54 గ్రాముల బంగారం తాకట్టు పెట్టాడు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ చోరీ కేసులో కిరణ్ హస్తం ఉండటంతో అరెస్టు చేసిన ఎస్సై పి.నవీన్‌కుమార్ సింగరాయకొండకు తీసుకొచ్చారు. గోల్డ్ లోన్ కంపెనీలో రికార్డులు పరిశీలించి, కిరణ్ తాకట్టు పెట్టిన సొత్తును ఇవ్వాలని బ్రాంచ్ మేనేజర్ షఫీని కోరారు. ఎస్సై నుంచి వివరాలు తీసుకున్న మేనేజర్, ఆ సమాచారాన్ని ప్రధాన కార్యాలయానికి తెలియజేశారు. వారంలోగా బంగారం అప్పగిస్తామని మేనేజర్ చెప్పారని ఎస్సై పేర్కొన్నారు.

బౌద్ధంతో మానవతా విలువలు



మాట్లాడుతున్న విజయకుమార్

ఒంగోలు వన్‌టౌన్: బౌద్ధంతో మానవతా విలువలు కలిగిన సమాజం సాధ్యమని విశ్రాంత ఐఏఎస్ జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ పేర్కొన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్వయంగా ఏర్పాటు చేసిన ద బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఈ.మహేష్ ఆధ్వర్యంలో ఒంగోలులో 68వ బౌద్ధ దమ్మ దీక్ష ఉత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. మానవతా విలువలు కలిగిన సమాజం ద్వారా మనిషికి ప్రజ్ఞ, శీల, కరుణ అనేవి అలవాటు అవుతాయన్నారు. వీటి ద్వారా భారత్‌ను అసమానతలు లేని దేశంగా తయారు చేయవచ్చన్నారు. ఎస్ఎస్‌డీ దిగంబర్ కాంబ్లే మాట్లాడుతూ.. భారతదేశానికి బౌద్ధం అవసరం ఎక్కువగా ఉందన్నారు. బౌద్ధం లేకపోతే దేశం అసమానతలతో విచ్చిన్నలయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే విద్యాసాగర్ మాట్లాడుతూ.. నిజమైన సమాజాభివృద్ధికి బౌద్ధం చాలా అవసరమన్నారు. మయన్మార్ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువు ఆయుపాల, తెలంగాణ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువు ఉజ్వల్ భరద్వాజ్ దమ్మ ఉపదేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా 50 మంది దమ్మ దీక్షను స్వీకరించారు. కార్యక్రమంలో టీబీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ దుర్గారావు, జాతీయ కార్యదర్శి వై.కొండల్‌రావు, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఇ.నాగేశ్వరరావు, పిల్లి రాంబాబు, జిల్లా కోఆర్డినేటర్ బి.రాజేష్, కె.అనిల్, కె.రామకృష్ణ, నాగేంద్రవర్ధన్, డాక్టర్ సుధాకర్, కేకే బోధి తదితరులు పాల్గొన్నారు.

రేపు బిర్సా ముండా జయంత్యుత్సవం

ఒంగోలు వన్‌టౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సా ముండా జయంత్యుత్సవాన్ని ఈ నెల 26వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.జగన్నాథం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వేడుకలు నిర్వహించిన్నట్లు పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా గిరిజన భవన్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

పచ్చని కొండలను పిండేస్తున్నారు

- పెద్దారవీడు మండలంలో యథేచ్ఛగా గ్రావెల్ దందా
- రియల్ ఎస్టేట్ వెంచర్ల యజమానులకు విక్రయం
- చోద్యం చూస్తున్న అధికారులు



బద్వీడు చెర్లోపల్లి రెవెన్యూ పరిధిలో అక్రమ తవ్వకాలతో తరిగిపోతున్న కొండ

పెద్దారవీడు: ''అధికారం మాది అక్రమాలు చేస్తాం అధికారులు మమ్మల్ని ఏమీ చేయలేరు'' అనే రీతిలో ఉంది తెలుగు తమ్ముళ్ల వ్యవహార శైలి. పెద్దారవీడు మండలంలో జంకూ బొంకూ లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వి తరలిస్తూ లక్షల రూపాయలు పోగేసుకుంటున్న తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. గ్రావెల్ మాఫియా సాగిస్తున్న దందాకు అడ్డుకట్ట వేయాల్సిన ఉన్నతాధికారులు ఏమీ తెలియనట్లు నిద్ర నటిస్తున్నారు. పెద్దారవీడు మండలంలోని తోకపల్లి రెవెన్యూ పరిధిలో సుంకేసుల గ్రామ ముంపు నిర్వాసితుల కాలనీ దగ్గర కొండ, తోకపల్లి గ్రామానికి చెక్‌డ్యామ్ దగ్గర కొండ, బద్వీడుచెర్లోపల్లి నుంచి రామాయపాలెం గ్రామానికి వెళ్లే రహదారి పక్కన కొండ, గొబ్బూరు గ్రామం సమీపంలో కొండలపై అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. భారీ స్థాయిలో కొండల తవ్వకాలు జరుగుతున్నా అడ్డుకునే నాథుడే కనిపించడం లేదు. దీంతో నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లలో గ్రావెల్ మట్టి తరలిపోతుంది. యథేచ్ఛగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు నోరుమెదపకపోవడంలో మర్మమేంటో అర్థం కావడం లేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చినా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



తోకపల్లి రెవెన్యూ పరిధిలో సుంకేసుల నిర్వాసితుల కాలనీ దగ్గర గ్రావెల్ తవ్వేసిన దృశ్యం

అనుమతి తప్పనిసరి

ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే ముందుగా గ్రామ పంచాయతీ, రెవెన్యూ శాఖ, మైనింగ్ శాఖ ద్వారా అనుమతి తప్పనిసరి. దరఖాస్తు చేసుకున్న తర్వాత రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు. అయితే ఇందుకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి లేకుండా టీడీపీ నాయకులు యథేచ్ఛగా పచ్చని కొండలను పిండి చేసి మట్టిని దేవరాజుగట్టు, హనుమాన్ జంక్షన్‌కుంట, దోర్నాల, తదితర ప్రాంతాల్లో నూతనంగా వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు, నూతన భవనాలకు కొనసాగిస్తుండడం గమనార్హం. ప్రభుత్వం ఒక వైపు మట్టి మాఫియాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నప్పటికీ అది కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది. గొబ్బూరు, రామాయపాలెం, తోకపల్లి గ్రామాల సమీపంలో ఉన్న పచ్చని కొండల స్వరూపం మారుతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్న విషయంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొండలకు పొక్లెయిన్ పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల సాయంతో రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతుండటంతో స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఒక్కో టిప్పర్ మట్టి దూరాన్ని బట్టి రేటుకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ మట్టి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు చేపట్టాలని, పచ్చని కొండలను రక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

> **అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు**
>
> గ్రామాల్లో కొండల మట్టిని అక్రమంగా తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మండలంలోని కొండల వద్ద అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని పోలీసులు, మైనింగ్ అధికారులకు తెలియజేశా. వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉంటూ సమాచారం అందించాలని ఆదేశించాం. కొండల వద్ద వీఆర్ఏలను కాపలా పెట్టాం.
>
> – శైలేంద్రకుమార్, పెద్దారవీడు తహసీల్దార్

ఐపీఎల్ రేసులో చిన్నదోర్నాల యువకుడు

- రూ.30 లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలో నిలిచిన మనీష్‌రెడ్డి
- ఆంధ్రా రంజీ జట్టు తరఫున ప్రాతినిధ్యం



మనీష్‌రెడ్డి

పెద్దదోర్నాల: ప్రపంచ వ్యాప్తంగా క్రీడాభిమానులను ఉర్రూతలూగించే ఐపీఎల్ రేసులో పెద్దదోర్నాల మండలంలోని చిన్నదోర్నాల గ్రామానికి చెందిన గొలమారు మనీష్‌రెడ్డి ఉన్నారు. గొలమారు ఉమామహేశ్వరరెడ్డి కుటుంబం వ్యాపార రీత్యా విశాఖపట్నంలో స్థిరపడింది. ఉమామహేశ్వరరెడ్డి తండ్రి గొలమారు పెద్దతాతిరెడ్డి గతంలో శ్రీశైల పుణ్యక్షేత్రంలోని అఖిల భారత రెడ్ల సత్రం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమామహేశ్వరరెడ్డి పెద్ద కుమారుడు మనీష్‌రెడ్డి చిన్ననాటి నుంచి క్రికెట్‌పై ఆసక్తి పెంచుకుని, ఆంధ్ర తరఫున రంజీ మ్యాచ్‌లు ఆడుతున్నాడు. ఈ క్రమంలో ఐపీఎల్‌లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వేలానికి సిద్ధమయ్యారు. రూ.30 లక్షల బేస్ ప్రైజ్‌తో ఐపీఎల్ వేలం రిజిస్టర్ చేసుకున్నారు. పలు ఐపీఎల్ జట్లు కొత్త కుర్రాళ్ల వైపు దృష్టి సారిస్తున్న నేపథ్యంలో మనీష్‌రెడ్డికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని క్రీడాభిమానులు భావిస్తున్నారు. కాగా సోమవారం కూడా నిర్వహించనున్న ఐపీఎల్ వేలంలో మనీష్‌రెడ్డికి అవకాశం దక్కవచ్చని భావిస్తూ మనీష్‌రెడ్డికి ఆల్ ద బెస్ట్ చెబుతున్నారు.

ప్రజా ఉద్యమాలతో సామ్రాజ్యవాద పీడన అంతం



మాట్లాడుతున్న జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్

ఒంగోలు టౌన్: ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం ద్వారా ఆసియా దేశాలపై కొనసాగుతున్న సామ్రాజ్యవాద పీడనను అంతం చేయవచ్చని జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్ అన్నారు. స్థానిక హైదరీ క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం మేల్కొన్న ఆసియా, స్టాలిన్ గ్రాడ్ దీర్ఘ కవితల తెలుగు అనువాద పుస్తక పరిచయ సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. నేటి కవులు, రచయితలు సామ్రాజ్యవాదాన్ని బలమైన గొంతుకలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. శ్రామిక ప్రజలను బలిపెడుతున్న సామ్రాజ్యవాదం ప్రజలందరికీ శత్రువని అభివర్ణించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల వెనక అమెరికా సామ్రాజ్యవాదులు ఉన్నారని జనసాహితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య చెప్పారు. మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియా ప్రాంతంలో ఉన్న ఆయిల్ కోసం ఇజ్రాయిల్ అనే దేశాన్ని సృష్టించారని చెప్పారు. ఇజ్రాయిల్ దాష్టికాలకు వ్యతిరేకంగా భారత దేశం నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ సభకు డీవీ అధ్యక్షత వహించగా ఏసుదాసు, ఖాదర్ బాషా, యోహన్ రెడ్డి, సత్యనారాయణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారులో మంటలు



దగ్ధమవుతున్న కారు

మార్కాపురం: కారు ఇంజిన్‌లో సాంకేతిక సమస్య కారణంగా వైర్లు షార్టు సర్క్యూట్ అయి మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన ఆదివారం మార్కాపురం పట్టణంలోని కళాశాల రోడ్డులో ఉన్న ఓ షాపింగ్‌మాల్ వద్ద చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన ఎం.వెంకటనారాయణ తన కారులో శ్రీశైలం వెళ్తూ ఆదివారం మధ్యాహ్నం మార్కాపురంలోని ఓ షాపింగ్ మాల్ వద్ద నిలిపారు. వ్యక్తిగత పని చూసుకుని వచ్చే సమయానికి కారులో దట్టమైన పొగ, మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే కారు ముందు భాగం దగ్ధమైంది. స్థానికులు నీరు చల్లి మంటలు అదుపుచేశారు. ప్రమాద సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

కోడి పందేలపై పోలీసుల దాడి

కొనకనమిట్ల: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం మండల పరిధిలోని వాగుమడుగు గ్రామ పొలాల్లో చోటుచేసుకుంది. నిందితలను అరెస్ట్ చేయడంతోపాటు వారి నుంచి ఆరు కోడి పుంజులు, 8 మోటారు సైకిళ్లు, రూ.41 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.రాజ్‌కుమార్ చెప్పారు.

9 మంది జూదరులు అరెస్టు

సంతనూతలపాడు: మండలంలోని మద్దులూరులో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై అజయ్‌బాబు తెలిపారు. నిందితుల నుంచి రూ.9 వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే చిలకపాడు గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజలను కలిపి ఉంచేదే కవిత్వం



తెలుగు లోగిలి వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ కవి కె. శివారెడ్డి

- ప్రముఖ కవి శివారెడ్డి

ఒంగోలు టౌన్: ప్రజలను కలిపేదే కవిత్వమని, కవి సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ప్రముఖ కవి కే శివారెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నూనె వెంకాయమ్మ- వెంకటరత్నం స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని ఆదివారం ఆయనకు అందజేశారు. అంతకుముందు ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ కవిత్వం రాయడమంటే ఖడ్గంతో సహజీవనం చేయడమే అని చెప్పారు. ప్రస్తుతం దేశంలో కల్మష వాతావరణం నెలకొందని విచారం వెలిబుచ్చారు. ఓర్పు నశించిందని, అసహనం రాజ్యమేలుతోందన్నారు. జాతీయవాదం పేరిట విష ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ముస్లింలతో మమేకమై జీవించడానికి బదులుగా వైరుధ్యం పెట్టుకోవడం సమర్థనీయం కాదన్నారు. కవులు ప్రజలను కలిపి ఉంచేందుకు పనిచేయాలని సూచించారు. ఒంగోలుతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఇక్కడికి వచ్చి పునరుత్తేజం పొందానని, ఇక్కడి మిత్రులను కలవడం వలన కొత్తగా ప్రాణంలేచి వచ్చినట్లుగా ఉందన్నారు. కవులు కలిపి ఉంచే పని చేస్తారని, రాజకీయ నాయకులు విడదీసే కుట్రలు చేస్తారని పునరుద్ఘాటించారు. కవిత్వమే తనకు ప్రాణం అని, అది తనను నడిపించే శక్తి అని తెలిపారు. తెలుగు భాషను సుసంపన్నం చేస్తున్న సాహితీమూర్తులను ఒంగోలుకు పిలిపించి సత్కరించడం గొప్పవిషయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. అనంతరం పది మంది సాహితీవేత్తలకు పురస్కారాలు అందజేశారు. సభకు సరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించగా సంస్థ అధ్యక్షుడు నూనె అంకమ్మరావు నిర్వహించారు. ఈ సభలో ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రముఖ సాహితీవేత్తలు వీరవల్లి సుబ్బారావు, డా.భూసరపల్లి వెంకటేశ్వర్లు, కృష్ణా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, శరత్ బాబు, సంతవేలూరి కోటేశ్వరరావు, కుర్రా ప్రసాద్ రావు, మిడసల మల్లికార్జునరావు, జ్యోతిర్మయి, బెల్లంకొండ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సభలో చందు అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

పురస్కార గ్రహీతలు వీరే..

కాకుమాను శివ ప్రసాద్, ఐఏఎస్, పంజాబ్ (డా.నాగభైరవ, డా.మండవ నరసింహారావు స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం), డా.నాగసూరి వేణుగోపాల్, హైదరాబాద్ (కొంపల్లి బాలకృష్ణ స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం), డా.డి.పార్వతీ దేవి, కర్నూలు (సింహాద్రి విశాలాక్షి స్మారక పురస్కారం), పాలపర్తి జ్యోతిష్మతి, అద్దంకి (భూసరపల్లి సుబ్బరత్నం- ఆదిశేషయ్య స్మారక పురస్కారం), డా.వి.రఘుపతి, చిత్తూరు (కరణం జ్ఞానేశ్వరి స్మారక పురస్కారం), డా.బూసి వెంకట స్వామి, విశాఖ పట్నం (తన్నీరు కోటయ్య స్మారక పురస్కారం), వంగర శ్రీధర్, చీరాల (సీతాదేవి-నాగేశ్వరరావు స్మారక పురస్కారం), కోటి రామోహోహన్ రావు, చిలకలూరిపేట (వంకాయలపాటి రామకృష్ణ స్మారక పురస్కారం), ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, గుంటూరు (కొలకలూరి స్వరూపరాణి స్మారక పురస్కారం), యంవీఎస్ ప్రసాద్, కాకినాడ (మేకల జయరామిరెడ్డి స్మారక పురస్కారం), అలంకారం వేంకటరమణరాజు, దామవరపు మసలయ్య, బాలనర్తకి బొప్పరాజు రాజశ్రీ, కవయిత్రి నాంచారమ్మలకు కళామిత్ర రాష్ట్ర స్థాయి పురస్కారాలను అందజేశారు.

జిల్లా మెప్మా మహిళా సమాఖ్య ఎన్నిక



మాట్లాడుతున్న మెప్మా పీడీ తేళ్ల రవికుమార్

చీమకుర్తి: జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలోని మెప్మా మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం చీమకుర్తిలోని మెప్మా కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షురాలిగా ఒంగోలు మెప్మా నుంచి జి.భారతి, ఉపాధ్యక్షురాలిగా చీమకుర్తి నుంచి డి.అంజమ్మ, కార్యదర్శిగా కనిగిరికి చెందిన ఐ.రాధ, ఉప కార్యదర్శిగా దర్శికి చెందిన ఎస్.భాగ్యలక్ష్మి, కోశాధికారిగా ఒంగోలు నుంచి ఎస్.ప్రమీలతోపాటు మరో ఏడుగురు కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సభ్యులను చురుకుగా నడిపించడంలో జిల్లా అర్బన్ మహిళా సమాఖ్య కార్యవర్గం ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చీమకుర్తి మెప్మా సిబ్బంది చిరంజీవి, టీఈలు ఫణికుమారి, జయకుమార్, సంతోష్‌కుమార్, రాణి, రాజేశ్వరి, ఆర్‌పీలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కాపు సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 22వ తేదీన నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అసోసియేషన్ వ్యవస్థాపకులు పేరూరి ఫణీంద్ర, దుత్తా బాల ఈశ్వరయ్య కోరారు. పట్టణంలోని బలిజ సేవా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒంగోలులో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలకు కాపులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాపుల్లో పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు సంఘం ఆవిర్భవించిందన్నారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాపు టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసరావు, పత్తి శేఖర్, ఎల్.వెంకటేశ్వర్లు, కాపు సంఘం నాయకులు రంగసుబ్బయ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన పురుషులు, మహిళల కబడ్డీ జిల్లా జట్లు

ఒంగోలు: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్లను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు నేతృత్వంలో స్థానిక మినీ స్టేడియంలో ఆదివారం ఎంపిక చేశారు. అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు అన్ను వేణుగోపాల్, గిరి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకుడు వై.శీనయ్య తదితరులు ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో పురుషులు 17 మంది, మహిళలు 17 మందిని ఎంపిక చేశారు. వీరు త్వరలో సంతనూతలపాడులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఆరికట్ల సుమతి, పూర్ణచంద్రరావు, ప్రసాద్, ఈదర వెంకట సురేష్‌బాబు(చిన్నారి), శిరిగిరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పురుషుల జట్టు : పి.బాలకృష్ణారెడ్డి, కె.వెంకటేష్‌రెడ్డి, హరిప్రసాదరెడ్డి, జి.లక్ష్మారెడ్డి, జి.లక్ష్మణ్, ఎ.సుబ్బారెడ్డి, బి.బ్రహ్మారెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, ఎస్.మణిరెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, జి.మల్లికార్జునరెడ్డి, ఎ.మంత్రూనాయక్, బి.అయ్యప్ప, జి.శ్యాంసన్, కె.సాయిరామ్, వి.బ్రహ్మారెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి.

మహిళల జట్టు : వి.అర్చన, కె.భూమిక, కె.నందిని, కె.సౌమ్య, కె.విజయలక్ష్మి, డి.భవాని, ఎం.సుప్రజ, కె.సుప్రియ, కె.నిరీష, ఎం.కీర్తిరెడ్డి, వి.రోహిణి, జె.కళ్యాణి, వై.గాయత్రి, సీహెచ్ సింధు, ఎ.హేమలత, జి.నాగలత, ఎం.నాగ హైమవతి, బంగారమ్మ.

ఆహ్లాదం గోవిందా!

- మార్కాపురంలో గాంధీ పార్కు తొలగింపునకు రంగం సిద్ధం
- పార్కు తూర్పు వైపు ప్రహరీ, ఇనుప గ్రిల్స్ తొలగింపు



మాట్లాడుతున్న డాక్టర్ కనకదుర్గ

మార్కాపురం: మార్కాపురం పట్టణానికే తలమానికంగా ఉన్న గాంధీ పార్కు తొలగింపునకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆదివారం పార్కు తూర్పువైపున ఉన్న గోడ, ఇనుప గ్రిల్స్‌ను తొలగించారు. సుమారు 67 ఏళ్ల చరిత్ర కలిగిన మార్కాపురం గాంధీ పార్కు కనుమరుగు కానుందన్న అనుమానాలు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మార్కాపురం అంటేనే చెన్నకేశవస్వామి ఆలయం, గాంధీ పార్కు, గోడ గడియారం గుర్తుకువస్తాయి. 1957 నవంబరు 25న అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గాంధీ పార్కుతోపాటు గడియార స్తంభం సెంటర్‌ను ప్రారంభించారు. కాలక్రమంలో ఆ పార్కు చెత్తాచెదారానికి, అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ భర్త డాక్టర్ కిశోర్ శేఖర్‌రెడ్డి 1996లో మార్కాపురం యూత్ సర్వీసు సొసైటీ(మైస్)ని ఏర్పాటు చేసి తన సొంత నిధులతోపాటు దాతల సహకారంతో పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ పార్కును అహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కలర్ టీవీని ఏర్పాటు చేయడంతో సాయంత్రం వేళ పట్టణ ప్రజలు, వృద్ధులు కాసేపు అక్కడ సేద తీరేవారు. ఇదే పార్కులో 2004లో దూపాడు మంచినీటి శిలాఫలకాన్ని నాటి సీఎం వైఎస్సార్ ఆవిష్కరించారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన గాంధీ పార్కును ట్రాఫిక్‌కు అడ్డు అనే కారణంతో అధికారులు తొలగించాలని నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ బస్సులన్నీ పార్కు చుట్టూ తిరిగి వెళ్తున్నాయి. ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే కొత్తగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో అధికారులు మొదటి విడతగా పార్కు తూర్పువైపు గోడను తొలగించారు. మళ్లీ అక్కడే వ్యాపారులు బండ్లు పెట్టుకుని అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వడం వివాదాస్పదం అవుతోంది.

పార్కు గోడ కూల్చివేతపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ కనకదుర్గ తీవ్రంగా స్పందించారు. ''ఎన్నో ఏళ్లుగా ఉన్న గాంధీ పార్కును తొలగించాలనుకోవడం చాలా బాధ కలిగిస్తోంది. ఉద్దేశపూర్వకంగానే పార్కును తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత 30 ఏళ్ల నుంచి పార్కు నిర్వహణ బాధ్యతలు చూస్తున్నా. ఎటువంటి లాభాపేక్ష లేదు. జాతిపితను గౌరవించాల్సిన బాధ్యత అందరిదీ. ఇటీవల కాలంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నిధులతోపాటు తన సొమ్ము కలిపి సుమారు రూ.10 లక్షలతో పార్కును అభివృద్ధి చేశాం. పార్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది'' అని పేర్కొన్నారు. కాగా మున్సిపల్ కమిషనర్ నారాయణరావు స్పందిస్తూ.. ''గాంధీ పార్కును తొలగించం. ఆక్రమణల తొలగింపు వల్ల వ్యాపారం దెబ్బతిన్నవారికి ప్రత్యామ్నాయం చూపే వరకూ బండ్లు పెట్టుకునేలా పార్కు గోడను జరిపాం'' అని చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆగని వేధింపులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై కూటమి నాయకుల వేధింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. కూటమి నాయకుల ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటి వరకు అన్నవరం, తలమళ్ల, ఈగలపాడు, పాములపాడు, కుంచేపల్లిలో ఎఫ్ఏలు రాజీనామా చేశారు. ఇటీవల మూగచింతల, జువ్వలేరు, తమ్మగుంట ఎఫ్ఏలను విచారణ పేరుతో వేధించారు. ఆదివారం మూగచింతల, తుమ్మగుంట ఎఫ్ఏలకు అధికాలరుల నుంచి నోటీసులు అందాయి. ఉపాధి హామీ పనుల ప్రారంభం నుంచి పనిచేస్తున్న మూగచింతల ఎఫ్ఏ ప్రభుదాసు స్వగ్రామంలో ఉండటం లేదని, తుమ్మగుంట ఎఫ్ఏ అంబవరపు ఉమ తన భర్తతో పనిచేయిస్తోందని అభియోగం మోపారు. అనుభవం లేని వారిని మేట్‌గా నియమించడంతో వేతనదారులు కూలీ నష్టపోయినట్లు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన ఒంగోలులో విచారణకు హాజరు కావాలని ఇద్దరు ఎఫ్ఏలకు సూచించారు.